సాక్షి సిద్దిపేట

సోమవారం । 25 । డిసెంబర్ । 2023



సిద్దిపేటలోని సీఎస్ఐ చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ



విద్యుత్ కాంతుల్లో మెదక్ సీఎస్ఐ చర్చి

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. విద్యుత్ అలంకరణలతో ధగధగ మెరుస్తోంది. సోమవారం ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ పద్మారావు మొదటి ఆరాధన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. రెండో ఆరాధన ఉదయం 10 గంటలకు మొదలవుతోంది. ఈ ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి లక్షలాది మంది వస్తారని చర్చి నిర్వాహకులు భావిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. - మెదక్

న్యూస్‌రీల్

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొండా సురేఖ



సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొండా సురేఖ నియమితులయ్యారు. రాష్ట్రంలో పలు జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మెదక్‌కు కొండా సురేఖ నియమితులయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహకు మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి మంత్రి బాధ్యతలు అప్పజెప్పారు.

రాష్ట్ర సచివాలయంలో శ్రీరాములపల్లి విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్ర సచివాలయంలో ఆదివారం కోహెడ మండలం శ్రీరాములపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సందడి చేశారు. విజ్ఞాన, విహార యాత్రకు వెళ్లిన విద్యార్థులు రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిశారు. దీంతో వారికి సచివాలయాన్ని దగ్గరుండి చూపించారు. విద్యార్థులకు రాజకీయ, ఆర్థిక, పరిపాలన గురించి మంత్రి వివరించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఉస్మానియా జట్టుకు వర్గల్ విద్యార్థినులు




ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు తదితరులు

వర్గల్(గజ్వేల్): క్రీడల్లో ప్రతిభ చాటిన వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఉస్మానియా యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. ఎం.జ్యోత్స్న(బి.కాం- తృతీయ సంవత్సరం) యూనివర్సిటీ వాలీబాల్ జట్టులో చోటు దక్కించుకోగా, ఆర్ సుజాత(బీఏ-తృతీయ సంవత్సరం) షాట్‌పుట్‌కు ఎంపికయ్యారు. వీరు ఇంటర్ కాలేజీ టోర్నమెంట్‌లో చక్కని ప్రతిభ ప్రదర్శించారు. ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు, వీపీ గోవిందరావు, ఏటీపీ భాగ్యలక్ష్మి, పీడీ లోకేశ్వరి అభినందించారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం

డీబీఎఫ్ శంకర్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీబీఎఫ్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా స్వామ్య హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తోందని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. ఆదివారం మిరుదొడ్డిలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద మందికి పైగా పార్లమెంట్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేసి క్రిమినల్ లా చట్టాలను మార్చడం సిగ్గు చేటన్నారు. మనుష్యులందరూ సమానమనే సార్వజనీన హక్కులను కల్పించిన భారత రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం ఉల్లంఘిస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దార మల్లయ్య, ధార స్వామి, నక్క రాజం, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శిగా వేణు



చేర్యాల(సిద్దిపేట): ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) స్టూడెంట్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మండల పరిధిలోని ఆకునూరుకు చెందిన పుల్లని వేణుని నియమితులైనట్లు రాష్ట్ర ఇన్‌చార్జి గొల్లపల్లి రాజు పేర్కొన్నారు. ఈ నెల 22న హైదరాబాద్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతలతో జిల్లాతో పాటు రాష్ట్రంలోని హాస్టల్స్, డేస్కాలర్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

హ్యాపీ క్రిస్మస్

నేడే ఏసయ్య పండుగ ● ముస్తాబైన చర్చిలు

జిల్లా అంతటా క్రిస్మస్ శోభ సంతరించుకుంది. చర్చిలన్నీ విద్యుద్దీప కాంతులతో కళకళలాడుతున్నాయి. క్రిస్మస్‌ట్రీలు, శాంతాక్లాజ్, స్టార్లతో సుందరంగా అలంకరించారు. సోమవారం పండుగను నిర్వహించుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. జిల్లాలో సుమారు వెయ్యి వరకు చర్చిలున్నాయి. ఉదయం నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని పురాతన సీఎస్ఐ చర్చిలో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకుల ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



సుందరంగా ముస్తాబైన సిద్దిపేట సీఎస్ఐ చర్చి (ఇన్‌సెట్‌లో) ఏర్పాటు చేసిన పశువుల పాక

మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం





రాజగోపురం వద్ద భక్తుల సందడి, (ఇన్‌సెట్‌లో) పట్నాలు వేస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. జిల్లా నుంచే కాకుండా రాష్టంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. గంగరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే కొండపైన ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి వేడుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో స్వామివారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే.. కరీంనగర్‌కు చెందిన అమర్నాథ్ సుచిత్ర దంపతులు స్వామి వారికి బంగారు కోరమీసాన్ని ఆలయ ఏఈవో అంజయ్యకు అందజేశారు.

● నాచగిరిలో భక్తుల సందడి



దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారాంతపు సెలవురోజు కావడంతో తమ ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్‌జిల్లా నుంచి భక్తులు తరలివచ్చారు. హరిద్రానది వాగులో పుణ్యస్నానాల అనంతరం పలువురు దంపతులు సత్యనారాయణస్వామి వ్రతమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. అధ్యయనోత్సవాల సందర్భంగా గర్భగుడిలో విశేషాలంకృతులైన లక్ష్మీనృసింహస్వామివారిని, ఆళ్వారులను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అధ్యయనోత్సవ వేళ గర్భగుడిలో నాచగిరి లక్ష్మీనృసింహులు

‘డ్రమ్ సీడర్’తో సమయం ఆదా



యంత్రంతో వరి వితనాలు విత్తుతున్న రైతు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో ఆదివారం రైతు మహిపాల్ డ్రమ్‌సీడర్ ద్వారా వరిని సాగు చేపట్టారు. ఈ యంత్రంతో.. విత్తనం నానబెట్టిన మరుసటి రోజు నుంచి పొలంలో విత్తుకోవచ్చు. రెండు కిలోల విత్తనాలు ఎకరాకు సరిపోతాయి. దీంతో సమయం, కూలి ఖర్చులు ఆదా అవుతున్నాయి. అయితే విత్తనం మొలకవచ్చిన తరువాత నీరు పెడితే సరిపోతుందని కేవీకే శాస్త్రవేత్తల సూచన మేరకు ఈ సాగు చేస్తున్నట్లు మహిపాల్ చెప్పారు. సాధారణంగా విత్తనం నానబెట్టి మొలకెత్తిన తర్వాత నారు పోస్తారు. ఆ తర్వాత నాట్లు వేస్తారు. కాగా 22 నుంచి 30 రోజుల సమయం పడుతుండటం తెలిసిందే.

వేడుకగా దత్త జయంతి ఉత్సవాలు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ శ్రీదత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో దత్త జయంతి ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి, అవధూత గిరిమహరాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వామిల ఆధ్వర్యంలో హోమం, యజ్ఞం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ ఆవరణలోని ఇరవై ఒక్క యజ్ఞ గుండాలతో దత్త-చండీ హోమం నిర్వహించారు. 108 మంది రుత్వికులు, దంపతులు పాల్గొన్నారు. జ్యోతిర్లింగాలు, దత్తాత్రేయ మందిరం, సుబ్రహ్మణ్యస్వామి తదితర ఆలయాల వద్ద పూజలు చేశారు.

కీలక దశకు ట్రిపుల్ ఆర్

- భూసేకరణ, సామగ్రి తరలింపునకు రంగం సిద్ధం
- ప్రభుత్వ ఆదేశాల కోసం అధికారుల ఎదురుచూపులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో వంద కిలోమీటర్లపైనే రహదారి విస్తరణ



రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం మ్యాపు

గజ్వేల్: ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు)కు సంబంధించి ఉత్తర భాగంలో చేపట్టాల్సిన భూసేకరణ, సామగ్రి తరలింపు అంశాలపై సంబంధిత అధికారులు ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో సహజంగానే ట్రిపుల్ ఆర్ వ్యవహారంలోనూ కొంత స్తబ్దత ఏర్పడింది. ప్రస్తుతం అధికారిక కార్యక్రమాలన్నీ వేగవంతమవుతున్న నేపథ్యంలో ట్రిపుల్‌ఆర్ విషయంలో ముందడుగుపడే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ అంశం కీలక దశకు చేరుకుంది. భూసేకరణ, రోడ్డు నిర్మాణం కోసం గుర్తించిన స్థలంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, టవర్లు, ఇతర సామగ్రి పక్కకు తరలించే పనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించారు. ఉత్తర భాగంలోని ఉమ్మడి నల్గొండ జిల్లాతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి) పనులు జరగనున్నాయి. భూసేకరణను చేపట్టడానికి రెవెన్యూడివిజన్ల వారీగా కాలా (కాంపిటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్)లను ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఇందులో భాగంగానే చౌటుప్పల్, యాదాద్రి, అందోల్-జోగిపేటతో పాటు గజ్వేల్, తూప్రాన్, భువనగిరి కాలాల పరిధిలోనూ త్రీడీ నోటిఫికేషన్లు వెలువడిన సంగతి తెలిసిందే. మొత్తంగా ఎనిమిది కాలాల పరిధిలోని 84 గ్రామాల్లో 4700 ఎకరాల వరకు భూసేకరణ జరగనుండగా.. అత్యధికంగా గజ్వేల్‌లో 980 ఎకరాలను సేకరించనున్నారు. ఉత్తర భాగం రీజినల్ రింగు రోడ్డు నిడివి 158 కిలోమీటర్లు కాగా ఇందులో 100 కిలోమీటర్ల వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో విస్తరించనున్నది.

సామగ్రి తరలింపునకు చర్యలు

ఉత్తర భాగంలో నిర్మించనున్న ట్రిపుల్‌ఆర్ రోడ్డు గుర్తించిన భూముల్లో అడ్డంగా ఉన్న విద్యుత్‌స్తంభాలు, టవర్లు, ఇతర సామగ్రి తరలింపునకు చర్యలు తీసుకోనున్నాం. ఇందుకు సంబంధించిన కార్యాచరణపై కసరత్తు జరుగుతోంది. పూర్తికాగానే పనులు ప్రారంభమవుతాయి. భూసేకరణ అంశంలోనూ ముందడుగు పడనుంది.

– రాహుల్, ఎన్‌హెచ్‌ఏఐ డిప్యూటీ మేనేజర్

భూ సేకరణపై దృష్టి

ఎనిమిది కాలాలకు త్రీడీ నోటిఫికేషన్ల విడుదలతో అధికారులు ఇక ఆయా కాలాల పరిధిలోని భూముల సేకరణపై అధికారులు దృష్టి పెట్టారు. గత ప్రభుత్వంలో ఇందుకు సంబంధించిన కార్యాచరణ పూర్తికాకపోవడంతో ప్రస్తుతం కొత్త ప్రభుత్వం చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ పెద్దలు ఈ అంశంలో నిర్ణయం తీసుకొని ఆదేశాలిస్తే ఆ మేరకు ముందుకు సాగాలని అధికారులు ఎదురుచూస్తున్నారు. భూసేకరణలో భాగంగా అధికారులు గ్రామాలవారీగా రైతులకు పరిహారం అందించడానికి భూముల విలువలను లెక్కలు వేయనున్నారు. ఈ లెక్కలు వాస్తవికతకు దగ్గరగా ఉండేలా క్షేత్రస్థాయి పరిశీలనలు సైతం జరిపే అవకాశముంది. వీటితో పాటు సర్వే నంబరు, రైతు పేరు, భూసేకరణ జరగనున్న విస్తీర్ణం తదితర అంశాలు సైతం అధికారికంగా సమగ్రంగా తెలియజేయడానికి కసరత్తు జరగనున్నది. ఇకపోతే రీజినల్ రింగు రోడ్డు నిర్మాణం కోసం గుర్తించిన భూముల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు, టవర్లు, ఇతర సామగ్రి తరలింపుపై ఇప్పటికే ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్షించారు. సామగ్రి తరలింపునకు రూ.300 కోట్లకుపైగా ఖర్చవుతుందని అంచనా వేసిన నేపథ్యంలో ఆ ఖర్చు భరించడానికి సైతం రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనే ప్రకటన కూడా వెలువడింది. ఈ అంశంపై ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా)కు సమాచారమిచ్చి, ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించే అవకాశముంటుంది. పనులపై ఆదేశాల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

సీఎం సమావేశంలో జీవన్‌పాటిల్..

సిద్దిపేటరూరల్: రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఏడీసీపీ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు చేపట్టనున్న కార్యాచరణపై కలెక్టర్లకు, అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఏడీసీపీ శ్రీనివాస్ రావు

● రంగనాయక సాగరం.. సైక్లింగ్ రసవత్తరం



సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న యువత

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధి చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్‌పై రాష్ట్ర స్థాయి 8వ సైక్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు రసవత్తరంగా ముగిశాయి. అండర్ -14, 16, 18, 23 విభాగాల్లో బాలబాలికలకు, యువతకు, మహిళలకు వేర్వేరుగా సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యకర జీవన విధానం అలవర్చుకోవా లన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి, డీవైఎస్ఓ నాగేందర్, సైక్లింగ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఇంటర్ నేషనల్ కోచ్ మ్యాక్స్‌వెల్ తదితరులు పాల్గొన్నారు.

మంచు పొరల్లో ప్రకృతి



మిరుదొడ్డిలో కమ్ముకున్న పొగ మంచు



దుబ్బాక బస్టాండ్ ఆవరణలో..

జిల్లాలోని పలు ప్రాంతాలను పొగమంచు కప్పేసింది. మంచు పొరల్లో ప్రకృతి కనువిందు చేసింది. ప్రకృతి సోయగాలు ఊటీని తలపించాయి. పొగ మంచులో భానుడు సైతం చందమామను తలపించాడు. వెన్నులో చలిపుట్టించేలా కురిసిన మంచులో జనాలు ఉక్కిరి బిక్కిరయ్యారు. చలిమంటలతో ఊరట చెందారు. ఆదివారం ఉదయం దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో దట్టంగా కురిసిన పొగ మంచుతో జనాలు, వాహనదారులు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

- దుబ్బాక/మిరుదొడ్డి

క్లుప్తంగా

ఐటీఐ రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవం


ఎన్నికైన నూతన కార్యవర్గం తదితరులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఐటీఐలో ఆదివారం 3వ రాష్ట్ర ఐటీఐల సంఘం కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధరణికోట వెంకట్‌రమణ, కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎం.చందర్, కార్యదర్శి బుసిగొండ ఓంకార్‌లతోపాటు 21 మంది కమిటీని ఎన్నుకున్నారు. ఐటీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు కే. రామ్మోహన్‌రావు కమిటీ నిర్వాహకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకట్‌రమణ మాట్లాడుతూ.. ఐటీఐల బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. జిల్లాల్లో కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐటీఐ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


అందని ద్రాక్ష..

- సాగు పునఃప్రారంభంపై సన్నగిల్లిన ఆశలు
- క్రమంగా కనుమరుగవుతున్న వైనం
- గతంలో ద్రాక్షకు హబ్‌గా ఉమ్మడి మెదక్ జిల్లా
- నేడు భిన్నమైన పరిస్థితులు
- పట్టించుకోని ఉద్యానవనశాఖ

ద్రాక్ష సాగును తన జాబితాలోంచి ఉద్యానవనశాఖ తొలగించినట్లే కనబడుతోంది. సాగు దాదాపుగా కనుమరుగవుతున్నా.. పునః ప్రారంభ కార్యాచరణను పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఒకప్పుడు ద్రాక్షకు హబ్‌గా ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో నేడు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

– గజ్వేల్


గజ్వేల్ ప్రాంతంలో ద్రాక్ష సాగు



రాష్ట్రంలో ద్రాక్ష సాగుకు సంబంధించి ఒకప్పుడు ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాలే ఆధారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా కొంత విస్తీర్ణం సాగయ్యేది. ఆయా జిల్లాల్లో మొత్తం ఏటా 50 వేల ఎకరాలకుపైగా తోటలు సాగులోకి వచ్చేవి. ప్రత్యేకించి ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం ద్రాక్ష సాగులో సింహభాగాన్ని ఆక్రమించేది. విదేశాలకు ఎగుమతి చేసేందుకు దోహదపడే సీడ్ లెస్ థామ్సన్, తాజ్ గణేష్ రకాలే ఇక్కడి రైతులు ప్రధానంగా సాగుచేసేవారు. విదేశాలకే కాకుండా ఇక్కడి నుంచి కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కూడా ద్రాక్ష ఎగుమతయ్యేది.

రెండేళ్లపాటు భారీ నష్టాలు..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పన్నెండేళ్ల కిందటి ద్రాక్ష తోటల సాగు ఇప్పుడు కనిపించడం లేదు. సాధారణంగా జనవరి రెండో వారం ప్రారంభమై ఏప్రిల్ నెలలో కోతకు వస్తుంటాయి. అప్పట్లో వరుసగా రెండేళ్లపాటు అకాల వర్షాలు కురిసి ఉమ్మడి మెదక్ జిల్లాలో ద్రాక్షకు భారీ నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితుల్లో పండ్లు కుళ్లిపోయి అమ్మే వీలు లేకపోవడంతో రైతులు కోట్లల్లో నష్టపోయారు. ఈ పరిణామం వల్ల క్రమంగా తగ్గుతూ వచ్చి ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒకటి, రెండు చోట్ల మినహా సాగు దాదాపుగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా స్థానిక అవసరాలకు మహారాష్ట్ర ద్రాక్షను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

తగ్గడానికి గల కారణాలపై చర్చలు

ద్రాక్ష సాగు ఆగిపోయే పరిస్థితి రావడంతో 2022 ఫిబ్రవరి నెలలో ఉద్యానవనశాఖ సిద్దిపేట జిల్లాలోని ములుగు కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన యూనివర్సిటీ ఆధ్వర్యంలో ద్రాక్ష సాగు పునఃప్రారంభంపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేయడానికి నిర్ణయించారు. రాజేంద్రనగర్‌లోని ఉద్యానవన కళాశాలలో మేధోమథన సదస్సు నిర్వహించారు. దేశంలోని ద్రాక్ష పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సాగుపై తగ్గడానికి గల కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. హైదరాబాద్‌కు సమీపంలోని ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాలోని భూములన్నీ రియల్ వ్యాపారం కారణంగా బడా బాబులు చేతులకు వెళ్లిపోవడం, ద్రాక్ష సాగుకు కూలీలు సమస్యగా మారడం, పెట్టుబడి లక్షల్లో ఉండటం, ఎరువులు, క్రిమి సంహారకాల నిర్వహణ కష్టతరంగా మారడం వంటి కారణాల వల్ల సాగు పడిపోయింది. గతంలో రాష్ట్రం మొత్తంగా చూస్తే కేవలం 500 ఎకరాల్లోపే ఉన్నదని కూడా నిర్ధారించారు. ఏటా కనీసం వెయ్యి ఎకరాలు కొత్తగా ద్రాక్ష సాగు పెరిగేలా ఏం చేయాలనే అంశంపై పలు నిర్ణయాలు తీసుకున్నారు.



అమలుకు నోచుకోని కార్యాచరణ..

ప్రస్తుతం ద్రాక్షలో టేబుల్, జ్యూసీ, వైన్ అనే మూడు రకాలుంటాయి. ఇందుల్లో ఒక్కో వెరైటీలో ఎన్నో కొత్త వంగడాలు వచ్చాయి. ఈ రకాలపై రైతులకు అవగాహన కల్పించి నేలలకు అనుకూలమైన రకాలను ఎంచుకొని సాగు చేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు. మరో ముఖ్యమైన అంశమేమిటంటే పూణేలోని జాతీయ ద్రాక్ష పరిశోధన సంస్థతో కలిసి రైతులకు మంచి లాభసాటి రకాలను వృద్ధి చేసి అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. కానీ ఈ కార్యాచరణ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఫలితంగా ద్రాక్ష సాగు విషయంలో పరిస్థితులు మారలేదు. ఈ అంశంపై సిద్దిపేట జిల్లా ఉద్యానశాఖ సునీత మాట్లాడుతూ ప్రస్తుతం ద్రాక్ష సాగు పునః ప్రారంభంపై ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.

1,632 ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్యం

- కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి కమల్ వర్ధన్ రావు
- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


పటాన్‌చెరు టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న కమల్ వర్ధన్ రావు

పటాన్‌చెరు టౌన్: ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 1,632 ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి కమల్ వర్ధన్ రావు తెలిపారు. పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్దనూర్ గ్రామంలో టీబీ కేసులు లేకపోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతీ గ్రామంలో పథకాలు ఏ విధంగా ప్రజలకు అందుతున్నాయో తెలుసుకోవడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, డీఎంహెచ్‌ఓ గాయత్రీ, పటాన్ చెరు తహసీల్దార్ భాస్కర్, గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మీ, ఉప సర్పంచ్ కుమార్, డీఎల్‌పీఓ సతీష్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, గ్రామ కార్యదర్శి నీలిమ, హెల్త్ ఆఫీసర్ రాజేందర్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

కొండాపూర్(సంగారెడ్డి): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కమల్ వర్ధన్ రావు (ఐఏఎస్) ఆదివారం మండల కేంద్రమైన కొండాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రిలోని పలు విషయాలను, రోగులకు అందిస్తున్న సేవలపై మండల వైద్యాధికారి రేష్మా అంజుమ్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 11 మంది టీబీ పేషెంట్‌లు ఉండగా, వారికి నెలకు రూ.500 చొప్పున అందిస్తున్నామని, బీపీ పేషెంట్‌లు 1,560 మంది, షుగర్ పేషెంట్‌లు 790 మంది, బీపీ, షుగర్ రెండు ఉన్న వారు 350 మంది ఉన్నట్లు అధికారులు వివరించారు. ప్రస్తుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం కావాలని అధికారులను కోరారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన భవన ఏర్పాటుకు కృషి చేస్తామని కమల్ వర్ధన్ రావు హామీ ఇచ్చారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. న్యాల్‌కల్‌లో బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని కారు ఢీకొట్టింది. అలాగే, మద్దూరు మండలంలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. మనోహరాబాద్‌లో ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి.

న్యాల్‌కల్(జహీరాబాద్): కారు, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని న్యాల్‌కల్ తండా సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ తండాకు చెందిన నవీన్(26), నర్సింగ్(32) ఇద్దరూ బైక్‌పై రాంతీర్థ్ గ్రామంలో పాలు పోసి ఇంటికి తిరిగి వస్తున్నారు. న్యాల్‌కల్ తండా సమీపంలో అతివేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధి కూటిగల్ గ్రామ శివారులోని సమ్మక్క– సారలమ్మ గద్దె సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండకు చెందిన మల్లేశం అత్తగారి గ్రామమైన బైరాన్‌పల్లికి బైక్‌పై వస్తున్నాడు. మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు పక్క నుంచి వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి మనోహరాబాద్ మండలం కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే కమాన్ వద్ద జాతీయ రహదారిపై ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలు అయ్యాయి విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సరిగ్గా 33 ఏళ్ల తర్వాత కలుసుకొని బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా వారి గురువులను సైతం ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.

విద్యార్థిని మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థిని మృతి చెందిన ఘటన బీహెచ్‌ఈఎల్ కాలనీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహెచ్‌ఈఎల్ కాలనీలో నివాసముండే మదిహాబేగం (19) ఇంటర్మీడియట్ చదువుతుంది. శనివారం రాత్రి తన నివాసంలో చదువుకుంటూ స్పృహతప్పి పడిపోయింది. వెంటనే ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుంతలోకి దూసుకెళ్లిన బైక్

తీవ్రగాయాలతో వ్యక్తి మృతి

కోహీర్(జహీరాబాద్): రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి బైక్ దూసుకెళ్లడంతో తీవ్రగాయాలై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్‌లో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకొంది. ఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన వెంకటేశం (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. పని నిమిత్తం బైక్‌పై కోహీర్ నుంచి బిలాల్‌పూర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ఓ మలుపు వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై వెంకటేశం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యాభర్తల మధ్య గొడవ

ఉరివేసుకొని భర్త ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెందిన భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడ బీఎస్‌ఆర్ కాలనీకి చెందిన రాజుల ధర్మాంజనేయులు (38) పటాన్‌చెరు మండలం పాశంమైలారం పారిశ్రామిక వాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో కెమికల్ ఇంజనీర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం వారు ఉంటున్న ఇంటి మొదటి అంతస్తు నిర్మాణ ఖర్చుల విషయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. ఆదివారం ఉదయం డ్యూటీ నుంచి వచ్చిన ధర్మాంజనేయులు పిల్లల బెడ్రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గది నుంచి ధర్మాంజనేయులు ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో స్థానికుల సహకారంతో కుటుంబ సభ్యులు తలుపులు తీసి చూడగా ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రాజుల నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గీత కార్మికుడు ఆత్మహత్య


నాగయ్య(ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక గీత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని రామునిపట్లలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముసలి నాగయ్య(52)కు భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగయ్య కల్లు గీస్తూ, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పు చేసి గ్రామంలో నూతనంగా ఇల్లు నిర్మించాడు. పంటలు సరిగా పండకపోవడం, ఇంటి నిర్మాణానికి చేసిన అప్పు తీర్చేమార్గం లేక మనస్తాపం చెంది పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం తినడానికి ఇంటికి రాకపోవడంతో కుమారుడు పొలం వద్దకు వెళ్లగా ఉరివేసుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

కుంటలో చేప పిల్లలు మృతి

సుమారు రూ.6 లక్షల విలువ


మృతి చెందిన చేప పిల్లలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): విష ప్రయోగం జరిగిందా.. లేదా నీళ్లు మర్లబడి విషంగా మరాయో తెలియదు గానీ జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో కప్పరోని కుంటలోని చేప పిల్లలు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. చేప పిల్లల పంపిణీలో భాగంగా గత ప్రభుత్వం కప్పరోని కుంటలో 8 వేల చేప పిల్లలు వదిలింది. ఆదివారం మధ్యాహ్నం కుంటలోని చేప పిల్లలన్నీ మృతి చెందడంతో రైతులు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. మత్స్య సంఘం సభ్యులు, గ్రామస్తులు కుంట వద్దకు చేరుకొని చనిపోయిన చేప పిల్లలను చూశారు. విష ప్రయోగం జరిగిందా.. లేదా కుంటలోని నీళ్లు మర్లబడి విషంగా మారాయా అనే అనుమానాలతో పాటు ఎవరైనా విషం కలిపారా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.6 లక్షల విలువ గల చేప పిల్లలు మృతి చెందాయని ముదిరాజ్ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదృశ్యమై.. మంజీరాలో శవమై


మంజీరాలో తేలిన శివాజీ మృతదేహం

మనూరు(నారాయణఖేడ్) : పాన్‌మసాల తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి.. మూడురోజుల తర్వాత ఆదివారం మనూరు మండలం పుల్‌కూర్తి వంతెన వద్ద శవమై తేలాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని ఉప్పుగూడకు చెందిన శివాజీ(38)నారాయణఖేడ్ మార్వాడి గల్లికి చెందిన యశోదతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి తర్వాత శివాజీ నారాయణఖేడ్‌లోనే ఉంటూ ఓ బట్టల షాపులో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 21న ఉదయం పాన్ తెచ్చుకుంటా అని ఇంట్లో నుంచి వెళ్లిన శివాజీ ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో భార్య యశోద నారాయణఖేడ్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలోనే ఆదివారం మంజీరాలో మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు ఖేడ్‌కు చెందిన శివాజీగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పట్టపగలే రూ.13 లక్షలు చోరీ


వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

అల్లాదుర్గం(మెదక్): భూమి కొనుగోలు కోసం ఇంట్లో దాచిన రూ.13 లక్షలు పట్టపగలు చోరీకి గురైన ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీహెచ్‌ఈఎల్‌కు చెందిన ఆగు సాయికిరణ్ భూమి కొనుగోలు కోసం రూ.13 లక్షలను తన మామ గడిపెద్దాపూర్‌కు చెందిన గురుగుల మల్లేశం ఇంట్లో దాచాడు. ఈ నెల 22వ తేదీన మల్లేశం కుటుంబ సభ్యులు పత్తి చేను పనికి వెళ్లారు. ఇంట్లో మల్లేశం కూతురు దీపిక, తల్లి సత్తమ్మ మాత్రమే ఉన్నారు. వారిద్దరూ ఇంటి పనిలో నిమగ్నమై ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా వద్దనే ఉన్న తాళం తీసుకొని అందులోని రూ.13 లక్షలు ఎత్తుకెళ్లారు. బీరువాకు మాత్రం తాళం యథావిధిగా వేసి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం డబ్బుల కోసం మల్లేశం బీరువా తెరువగా డబ్బులు లేకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

ఆ మూడు కుటుంబాలకు దిక్కేది?

- ప్రభుత్వం నుంచి అందని ఆర్థిక సాయం
- బతుకమ్మ పండుగ రోజు ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు మృతి
- వారి కుటుంబాలను ఆదుకుంటామని అధికారుల హామీ
- రెండు నెలలైనా స్పందించని వైనం


ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న యాదమ్మ భర్త భూమయ్య


బాబు భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఎన్నికల తర్వాత ఆర్థిక సాయం ప్రభుత్వం తరఫున అందిస్తాం.. ఇది ఎవరో అన్న మాట కాదు కలెక్టర్ బాధిత కుటుంబ సభ్యులకు ఇచ్చిన హామీ. అలాగే అప్పటి మంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కూడా బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రెండు నెలలు దాటుతున్నా ఆ బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందనేలేదు. అధికారులు వచ్చి ఆదుకుంటారని ప్రతీ నిత్యం బాధిత కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి.

బతుకమ్మ చెరువు వద్ద మృతి

జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన గిరిపల్లి భారతమ్మ, కర్రమొల్ల బాబు, ఎల్లం యాదమ్మ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. బతుకమ్మ పండుగకు గ్రామంలోని బతుకమ్మ చెరువు వద్ద అక్టోబర్ 14న పనులు చేశారు. చివర్లో మెట్లు కడిగి వారు కూడా కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు ముగ్గురు నీట మునిగి మృత్యువాత పడ్డారు. దీంతో వీరిపైనే ఆధారపడ్డ కుటుంబాలు ఒక్కసారిగా రోడ్డు మీద పడ్డాయి. ఆ సమయంలో పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు, వివిధ కుల సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. చివరికి ఏసీపీ రమేశ్ ఆందోళన కారులకు నచ్చజెప్పడంతో పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుప్రతికి తరలించారు. అక్కడే కలెక్టర్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారు. నేటికీ రెండు నెలలు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందలేదు.

భారంగా కుటుంబ పోషణ

ఎల్లం యాదమ్మ మృతి చెందడంతో భర్త భూమయ్య, కొడుకు మహేశ్ ఉన్నారు. భూమయ్యకు గతంలో విద్యుత్‌షాక్ తగిలి మంచానికే పరిమితం అయ్యాడు. ప్రస్తుతం కొడుకు మహేశ్‌పై భారం పడింది. అలాగే, గిరిపల్లి భారతమ్మ మృతితో కొడుకు వంశీ అనాథగా మారాడు. తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో వంశీ ప్రస్తుతం అక్క శ్యామల వద్ద ఉంటున్నాడు. అలాగే, మృతుడు కర్రమొల్ల బాబుకు భార్య స్వప్న, ఆరేళ్ల లోపు ఇద్దరు కొడుకులు శ్రీవర్దన్, ఆయాన్ష్ ఉన్నారు. ప్రస్తుతం మృతుల స్థానంలో బాధిత కుటుంబ సభ్యులు పారిశుద్ధ్య కార్మికులుగా పనిలో చేరారు. అయినప్పటికీ వారిని కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

త్వరలో ప్రమాదబీమా..

ఈ విషయంపై ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు గ్రామ పంచాయతీ తరఫున ప్రమాదబీమా చేయడం వల్ల త్వరలోనే మూడు కుటుంబాలకు పోస్టల్ ప్రమాదబీమా నుంచి రూ.10 లక్షల చొప్పున చెక్కులు రావడం జరుగుతోంది. తక్షణ సాయం కింద పంచాయతీ నుంచి ఒక్కో కుటుంబానికి రూ.15 వేల చొప్పున అందించాం.